స్మైల్ ప్లీజ్..
దంతాల సంరక్షణతోనే సంపూర్ణ ఆరోగ్యం
నిర్లక్ష్యం వహిస్తే చిగుళ్లు, దంతాల సమస్యలు
మూడు నెలలకోసారి పరీక్ష చేయించుకోవాలి
అందుబాటులో అత్యాధునిక చికిత్స
7



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దేవాదాయశాఖ భూమిలో అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

కబ్జా చెర నుంచి ఆలయ భూమికి విముక్తి

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన ఎండోమెంట్ అధికారులు

హద్దురాళ్లను తొలగించి దేవాదాయశాఖ భూమిగా పేర్కొంటూ బోర్డు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మెదక్ పట్టణంలో వేణుగోపాలస్వామి ఆలయ భూమిని కొందరు కబ్జా చేసేందుకు యత్నిస్తుండటంపై 'కబ్జా చెరలో ఆలయ భూమి' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ఎండోమెంట్ అధికారులు స్పందించారు. హద్దురాళ్లు తొలగించి బోర్డు ఏర్పాటు చేశారు. వెంకట్రావ్‌నగర్ కాలనీలో 1128 సర్వే నంబర్‌లో 1.03 ఎకరాల స్థలంలో కొందరు హద్దురాళ్లు పాతి స్వాధీనం చేసుకున్నారు. బుధవారం అధికారులు వాటిని తొలగించారు. సదరు స్థలం దేవాదాయశాఖ పరిధిలోని వేణుగోపాలస్వామి ఆలయానికి చెందినగా పేర్కొంటూ బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లా ఎండోమెంట్ కమిషనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆలయ స్థలాన్ని కబ్జా చేయాలని ప్రయత్నిస్తే కేసులు పెడతామని హెచ్చరించారు.

గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో

కట్ట మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠలో నిర్మలా జగ్గారెడ్డి



సంగారెడ్డి ప్రజలపై అమ్మవారి కటాక్షం ఉండాలని పూజలు చేస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి ప్రజలపై అమ్మవారి కటాక్షం ఉండాలని పూజలు చేసిన టీజీఐఐసీ చైర్‌పర్సన్

సంగారెడ్డి టౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని చెరువు కట్టపై గంగపుత్ర సంఘం-సంగారెడ్డి వారి ఆధ్వర్యంలో బుధవారం కట్ట మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొని పూజలు చేశారు. అమ్మ వారి కృపా కటాక్షాలు సంగారెడ్డి పట్టణ ప్రజలపై ఉండాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో తోపాజీ అనంతకిషన్, కూన సంతోష్, కిరణ్ గౌడ్, ప్రదీప్, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు కూన సత్తయ్య, ప్రధాన కార్యదర్శి కిషన్, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు నగేష్, కార్యదర్శి చిదంబర్ సాయి, గంగపుత్ర సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



హోమం చేస్తున్న వేదపండితులు

అంగన్‌వాడీల్లో కొలువులు

ఖాళీల భర్తీకి సర్కారు చర్యలు

మెదక్ జిల్లాలో 52 టీచర్, 340 ఆయా పోస్టులు

మారిన విద్యార్హత నిబంధన

త్వరలో నోటిఫికేషన్



మెదక్ అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. టీచర్లు, ఆయాల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుంది. మెదక్ జిల్లాలో జిల్లా వ్యాప్తంగా నాలుగు ప్రాజెక్టుల పరిధిలో 1,076 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం 1024 మంది టీచర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం 52 టీచర్ పోస్టులు, 340 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారులు గుర్తించి నివేదికను ఉన్నతాధికారులకు అందించారు.

ఇంటర్ విద్యార్హత

గతంలో అంగన్‌వాడీ టీచర్ పోస్టుకు పదో తరగతి విద్యార్హతగా ఉండేది. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నూతన మార్గదర్శకాల ప్రకారం అంగన్‌వాడీ టీచర్‌తోపాటు హెల్పర్‌గా నియమించేందుకు ఇంటర్ పాసై ఉండాలి. అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి వయోపరిమితి 1835 ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది.

మెదక్ జిల్లాలో ఖాళీలు

మెదక్ జిల్లాలో మెదక్, రామాయంపేట, నర్సాపూర్, అల్లాదుర్గం ప్రాజెక్టుల కింద 1,076 అంగన్‌వాడీలు ఉన్నాయి.

ప్రాజెక్టు	టీచర్	ఆయా
మెదక్	6	69
రామాయంపేట	23	78
నర్సాపూర్	13	114
అల్లాదుర్గం	10	79

ప్రభుత్వానికి నివేదించాం

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీలను గుర్తించాం. ఖాళీగా ఉన్న కేంద్రాల్లో సమీపంలో ఉన్న కేంద్రాల నుంచి టీచర్లను, ఆయాలను సర్దుబాటు చేశాం. ఖాళీగా ఉన్న టీచర్లు, ఆయా పోస్టుల వివరాలను ప్రభుత్వానికి నివేదించాం.

-హైమావతి, జిల్లా స్త్రీశిశు సంక్షేమాధికారి, మెదక్

కంది మండలం చిమ్నాపూర్ తండా, తునికిల తండా, వడ్డెనగూడ తండా, ఎర్దనూర్ తండా, ఉత్తర్‌పల్లిలో 150 ఎకరాల వ్యవసాయ భూముల్లో ఇటుకబట్టీలు కొనసాగున్నాయి. నాలా మార్పిడి చేయకపోవడంతో ఈ భూమలకు ప్రభుత్వం రైతు భరోసా చెల్లిస్తున్నది. ఈ బట్టీలకు వ్యవసాయ కనెక్షన్ పేరిట ఉచిత విద్యుత్ కూడా పొందుతున్నారు. ఈ విషయం బహిరంగ రహస్యమే అయినప్పటికీ అధికారులు తమకేమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు.

సంగారెడ్డి మండలంలో పెద్ద సంఖ్యలో ఇటుకబట్టీలను అక్రమంగా నిర్వహిస్తున్నారు. దాదాపు అన్నీ వ్యవసాయ భూముల్లోనే ఉన్నాయి. ఈ భూములకు ఏళ్ల తరబడి రైతుబంధు డబ్బులు వస్తున్నాయి. ప్రభుత్వం మారిన తరువాత కూడా రైతుభరోసా డబ్బులు జమ చేశారు. పంట పొలాలకిచ్చే ఉచిత విద్యుత్ కూడా ఉపయోగించుకుంటున్నారు.

శివ్వంపేట మండల పరిధిలోని కొత్తపేట రూప్లా తండాలో ఇటుక బట్టీలను నిర్వహిస్తున్నారు. ఉసిరికపల్లి కొట్టాలలో ఉన్న ఇటుకబట్టీలు కూడా వ్యవసాయ భూముల్లోనే ఉన్నాయి. నాలా మార్పిడీ చేయకపోవడంతో ఈ భూములకు గతంలో రైతుబంధు డబ్బులు జమయ్యాయి. ఈసారి ఇంకా రైతుభరోసా డబ్బులు జమ కాలేదని తెలిసింది.

బట్టీలకూ భరోసా..!

నిబంధనలకు విరుద్ధంగా వ్యవసాయ భూముల్లో ఇటుకల తయారీ

వ్యాపారం చేసే భూములకు పెట్టుబడి సాయం

ఏళ్ల తరబడిగా లక్షలాది రూపాయలు దుర్వినియోగం

వాణిజ్య వినియోగానికి ఉచిత విద్యుత్ వాడకం

అధికారులు, నేతల అండదండలతో ఇష్టారాజ్యం



మెదక్ జిల్లా కొల్చారం మండలంలో పొలాల మధ్యన ఇటుక బట్టీలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 5: సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో నిర్వహిస్తున్న ఇటుక బట్టీల్లో చాలావరకు నిబంధనలు అతిక్రమిస్తున్నారు. బట్టీలు నిర్వహించాలంటే వ్యవసాయ భూమిని వాణిజ్య భూమిగా మార్చుకునేందుకు నాలా మార్పిడీ చేసి, రెవెన్యూ అధికారుల నుంచి పత్రాలు పొందాలి. అనంతరం ఆయా గ్రామాల కార్యదర్శులతో ఎన్‌వోసీ తీసుకోవాలి. కానీ, ఇవేవీ లేకుండానే ఇష్టారాజ్యంగా ఇటుకబట్టీలను నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

వ్యవసాయ భూముల జాబితాలోనే..

గత ప్రభుత్వ హయాంలో సాగులో లేని భూములకు కూడా రైతుబంధు డబ్బులు అందాయి. చెట్లుపుట్టలు, గుట్టలకూ పెట్టుబడి సాయం అందింది. ఇలా ఇటుకబట్టీలు ఉన్న భూములకు కూడా ప్రభుత్వసాయం అందించారు. క్రాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన అనంతరం వాణిజ్య భూములు, వ్యవసాయానికి యోగ్యం కాని భూములను గుర్తించి, రైతుభరోసా సహాయాన్ని కట్ చేస్తామని ప్రకటించింది. కానీ, వ్యవసాయ భూముల్లో కొనసాగుతున్న ఇటుకబట్టీలకు మాత్రం రైతుభరోసా సహాయం ఇప్పటికీ అందుతున్నట్లు తెలుస్తున్నది. ఒకే సర్వే నంబర్‌లో పంటలతోపాటు ఇటుకబట్టీలు ఉండటంతో మొత్తం భూములకు రైతు భరోసా సహాయం

మిగతా 8వ పేజీలో

ఇటుకబట్టీలకూ ఉచిత విద్యుత్

వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందిస్తున్న విషయం తెలిసిందే. అయితే, వ్యవసాయ భూముల్లోనే నిర్వహిస్తున్న ఇటుకబట్టీలకు కూడా ఉచిత వ్యవసాయ విద్యుత్‌ను వాడేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఇటుకబట్టీలకు కమర్షియల్ విద్యుత్‌ను వినియోగించాలి. కానీ, నాలా కన్వర్షన్ చేయకపోవడంతో వాణిజ్యపరమైన విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయడం లేదు. ఒకవేళ చేసినా అది నామ్‌కేవాస్తే అన్నట్లుగానే ఉంటుంది. వినియోగించేదంతా ఉచిత విద్యుత్తే. దీనివల్ల పంటలు సాగుచేస్తున్న రైతులకు లోఓల్టేజీ సమస్య తలెత్తుతోంది.



సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్

రైతుల ప్రైవేటు అప్పులు తీర్చడానికి

బ్యాంకు రుణాలు

ఇవ్వకుంటే ఫిర్యాదు చేయండి : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్

సంగారెడ్డి క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ అప్పులు తీర్చుకోవడానికి రైతులు పంటరుణాలతో పాటు అదనంగా దీర్ఘకాలిక రుణాలు కూడా బ్యాంకుల నుంచి పొందవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కోర్టులోని సమావేశ మందిరంలో బుధవారం ఆయన బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులు, రైతులతో సమన్వ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా మార్గదర్శకాల మేరకు తెలంగాణ రాష్ట్ర హైకోర్టు డబ్ల్యుపి (పిల్) 269/2018 ఉత్తర్వుల ప్రకారం ఈమేరకు అన్ని బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. రైతులు పంట రుణాలతో పాటు అదనంగా దీర్ఘకాలిక రుణాల కోసం బ్యాంకుల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అవసరమున్న రైతులు సంబంధిత బ్యాంకుల్లో రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బ్యాంకులు రుణాలు ఇవ్వబోమని చెబితే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. సమావేశంలో తెలంగాణ రైతు రక్షణ సమితి అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు, జిల్లా అధ్యక్షుడు కాసాల రాఘవేందర్‌రెడ్డి, మంజీరా రైతు సంఘం అధ్యక్షుడు పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

తొలిరోజు ప్రశాంతం

ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

- సంగారెడ్డి జిల్లాలో 18,296 మంది, మెదక్ జిల్లాలో 6,180 మంది విద్యార్థులు హాజరు

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు సెకండ్ ల్యాంగ్వేజ్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కేంద్రాల్లో వసతులు కల్పించారు. సీసీకెమెరాల నిఘా మధ్య పరీక్షలు కొనసాగాయి. ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ తనిఖీలు చేశారు. కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలను మూసి వేయించారు. సంగారెడ్డి జిల్లాలో 54 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరిగింది. విద్యార్థులను క్షుణంగా తనిఖీ చేసి కేంద్రాల్లోకి అనుమతించారు. ఫస్టియర్ 18,852 మంది విద్యార్థులకు 18,296 మంది హాజరయ్యారు. 97.05 శాతం హాజరు నమోదైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్ తెలిపారు. సంగారెడ్డిలోని బాలుర జూనియర్ కళాశాల కేంద్రాన్ని కలెక్టర్ క్రాంతి తనిఖీ చేశారు. ఈ కేంద్రంలో పది నిమిషాలు ఆలస్యంగా వచ్చిన ఓ విద్యార్థినిని అధికారులు లోపలికి అనుమతించలేదు.

మెదక్ జిల్లాలో..

మెదక్ జిల్లావ్యాప్తంగా 30 పరీక్షా కేంద్రాల్లో 6,410 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 6,180 మంది హాజరయ్యారు. 96.41 శాతం హాజరు నమోదైనట్లు ఇంటర్ నోడల్ అధికారి మాధవి తెలిపారు. జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల, గురుకుల బాలికల కళాశాల కేంద్రాలను కలెక్టర్ రాహుల్‌రాజ్ తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.



సంగారెడ్డిలో హాల్‌టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థినులు



మెదక్‌లో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్







సంగారెడ్డిలో పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి, విద్యార్థులను తనిఖీ చేస్తున్న పరీక్షా కేంద్రం సిబ్బంది

రంజాన్ వేళలు

గురువారం ఇఫ్తార్: సాయంత్రం 6.29
శుక్రవారం సహర్: ఉదయం 5.08

జహీరాబాద్‌లో
చెడ్డీగ్యాంగ్ కలకలం
భయాందోళనలో పట్టణ ప్రజలు



7

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించండి
సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి
7

ఎత్తుకు పైఎత్తు..

జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని టీఎన్‌జీవో ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టరేట్‌లో మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించారు. క్రీడలను ప్రారంభించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి ఉద్యోగులతో చెస్ ఆడారు. డీఆర్వో పద్మజారాణి, డీఆర్‌డీవో జ్యోతి, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు జావిద్‌అలీ, కార్యదర్శి రవి, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీకాంత్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
-సంగారెడ్డి అర్బన్ (ఆంధ్రజ్యోతి



రహదారిపై పచ్చని పందిరి

వేసవిలో గొడుగును తలపిస్తూ రోడ్డు పక్కన ఉన్న చెట్లు ఎండ నుంచి వాహనదారులకు ఉపశమనాన్ని కలిగిస్తున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగి చల్లని నీడనిస్తున్నాయి. కోహీర్ మండలం పిచేర్యాగడి నుంచి సజ్జాపూర్‌కు వెళ్లే మార్గంలో ఈ దృశ్యం కనిపిస్తుంది. ఈ రోడ్డుపై వెళ్లే వారు ఇక్కడ ఆగి సేదతీరి వెళ్తుంటారు.
-కోహీర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి)



వికసిత్ భారత్ యువ పార్లమెంట్ నోడల్ జిల్లాగా మెదక్

- పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం
- ఈనెల 9వ తేదీ వరకు రిజిస్ట్రేషన్‌కు గడువు
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్

మెదక్ అర్బన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ యువ పార్లమెంట్ నోడల్ జిల్లాగా మెదక్ ఎంపికైనట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.హుస్సేన్ తెలిపారు. బుధవారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. భారత్ యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో దేశ యువత ఆలోచన విధానాలపై పాలసీ పొందుపర్చి ప్రపంచంలోనే దేశాన్ని శక్తివంతమైన భారత్‌గా మార్చడానికి యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారన్నారు. మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాలకు నోడల్ కళాశాలగా మెదక్ డిగ్రీ కాలేజీను ఎంపిక చేశారని తెలిపారు. 18 నుంచి 25 ఏళ్ల లోపు వయసు కలిగిన వారు యూత్ పార్లమెంట్ పోటీలకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మొదటగా మై భారత్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 'నా దృష్టిలో వికసిత్ భారత్ అంటే ఏంటి' అంశంపైన ఒక్క నిమిషం నిడివి కలిగిన వీడియో చేసి ఈ నెల 9వ తేదీలోగా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. స్క్రీనింగ్ చేసి జిల్లాస్థాయిలో ఎంపిక చేస్తారని, ఆయా జిల్లాల నుంచి ఎంపికైన వారికి మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోటీ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇందులో 10 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారని వివరించారు. యూత్ పార్లమెంట్ పోటీలపై యువతకు అవగాహన కల్పించి, ఎక్కువ సంఖ్యలో పాల్గొనేలా చూడాలన్నారు. మిగతా వివరాలకు 9885077541, 9985372264, 9912787070 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

డాక్టర్ గదరాజు చందును అభినందించిన మాజీ సీఎం కేసీఆర్



మాజీ సీఎం కేసీఆర్‌కు గ్రంథాన్ని అందజేస్తున్న డాక్టర్ గదరాజు చందు

చేర్యాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం కడవేరుగు గ్రామానికి చెందిన డాక్టర్ గదరాజు చందును బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అభినందించారు. గదరాజు చందు ఇటీవల ప్రొఫెసర్ ఎం.గోనానాయక్ పర్యవేక్షణలో రాష్ట్రంలో దొమ్మర కులస్థుల సంస్కృతి, సాహిత్య పరిశీలన అంశంపై పరిశోధన పూర్తిచేసి, ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. సంబంధిత సిద్ధాంత తొలి గ్రంథాన్ని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చొరవతో మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసి చందు అందజేశారు. సాహిత్య పరిశోధన విషయాలను కేసీఆర్‌కు వివరించారు. అనంతరం కేసీఆర్ స్పందిస్తూ తెలంగాణ ఆది హిందూ జాతికులాల సంస్కృతీసంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ తెలంగాణ బిడ్డపై ఉందని, గ్రామీణ ప్రాంత బిడ్డగా అరుదైన పరిశోధన జరపడం పట్ల చందును అభినందించారు. ఆయనతో పాటు కేసీఆర్‌ను కలిసిన వారిలో రాళ్లబండి చందు, బొంగురం జితేందర్ రెడ్డి దాసరి అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రైలు నుంచి జారి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

మాసాయిపేట, మార్చి5 (ఆంధ్రజ్యోతి) : రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని ప్రయాణికుడు మృతిచెందిన సంఘటన బుధవారం మాసాయిపేట రైల్వేస్టేషన్ వద్ద చోటుచేసుకున్నది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. సుమారు 60 ఏళ్ల వయస్సున్న వ్యక్తి బుధవారం ఉదయం మాసాయిపేట రైల్వేస్టేషన్ వద్ద రైలులో నుంచి కిందపడి మృతిచెందాడు. స్టేషన్‌మాస్టర్ ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కామారెడ్డి రైల్వే ఆసుపత్రికి తరలించామని రైల్వే పోలీసు ఇన్‌చార్జి స్టేషన్ అధికారి రవికుమార్ తెలిపారు.

క్రైం కార్నర్

జహీరాబాద్‌లో చెడ్డీగ్యాంగ్ కలకలం

భయాందోళనలో పట్టణ ప్రజలు

జహీరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలో చెడ్డీగ్యాంగ్ దొంగల అలజడి కలకలం రేపుతున్నది. మంగళవారం తెల్లవారుజామున ముసుగులు ధరించి చెడ్డీ గ్యాంగ్ హల్‌చల్ చేసింది. ఈ గ్యాంగ్ పట్టణంలోని సాయినగర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో పలు అపార్ట్‌మెంట్‌ల వద్ద తిరగడం అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. స్థానికులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణం విస్తరించిన నేపథ్యంలో ఈ గ్యాంగు ఎక్కడెక్కడ తిరుగుతారో తెలియని పరిస్థితి నెలకొన్నదని స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వెంటనే సమాచారం ఇచ్చి సహకరించాలని పోలీసులు కోరుతున్నారు. పట్టణంలో పెట్రోలింగ్ వాహనాలను పెంచడంతో పాటు, పోలీసులందరినీ అలర్ట్ చేశామని, చెడ్డీగ్యాంగ్‌ను పట్టుకునే పనిలో ఉన్నామని ఎస్‌ఐ కాశీనాథ్ తెలిపారు. ప్రజలు ఆందోళన చెందొద్దని భరోసా కల్పించారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో కొత్త వ్యక్తులు తిరిగితే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.



జహీరాబాద్‌లో ఓ అపార్ట్‌మెంట్ వద్ద చెడ్డీగ్యాంగ్

చేపల వేటకు వెళ్లి.. చెరువులో పడి మృతి



కడారి లింగం(ఫైల్)

చిన్నకోడూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువు నీటిలో పడి మృతిచెందిన సంఘటన చిన్నకోడూరు మండలం ఎల్లమ్మజాలులో బుధవారం జరిగింది. ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. చౌడారం గ్రామానికి చెందిన కడారి లింగం (55) సెంట్రింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం సెంట్రింగ్ పని లేకపోవడంతో లింగం చేపలు పట్టుకు వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి అయిన లింగం ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టూ పక్కల వెతికారు. తెలిసిన వారిని అడిగినా ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం ఉదయం లింగం భార్య పద్మ కుమారుడితో కలిసి భర్త ఆచూకీ కోసం వెతుకుతూ ఎల్లమ్మజాలు వైపు వెళ్తుండగా గ్రామ శివారులోని చెరువు సమీపంలో రోడ్డుపై లింగం టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనం, చెరువు నీటి ఒడ్డున చెప్పులు కనిపించాయి. స్థానికుల సాయంతో నీటి దగ్గరికి వెళ్లే సరికి చేపలు పట్టడానికి వేసే వైరుతాడు (గాళం) కన్పించింది. తాడును పైకిలాగి చూసేసరికి దానికి చిక్కుకుని లింగం మృతదేహం పైకి తేలింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లింగం భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య



లంబాడి శ్రీను(ఫైల్)

కౌడిపల్లి, మార్చి (ఆంధ్రజ్యోతి) 5 : చెరువులో దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని వసురాం తండాలో మంగళవారం రాత్రి జరిగింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. వసురాంతండాకు చెందిన లంబాడి శ్రీను(32) కొంతకాలంగా పని చేయకుండా మద్యం తాగుతూ తిరుగుతున్నాడు. పని చేయకుండా ఉండటంతో ముగ్గురు ఆడపిల్లలు ఉన్నా పట్టించుకోకపోతే ఎలా అని కుటుంబసభ్యులు శ్రీనును నిలదీశారు. తీరు మార్చుకోవాలని సూచించారు. దీంతో మంగళవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన శ్రీను కన్నారం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీను భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి మృతికి తమ్ముడే కారణమని అక్క ఫిర్యాదు

తూప్రాన్ మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : గత నెల తల్లి మృతిచెందగా, తమ్ముడిపై అనుమానంతో అక్క పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన తూప్రాన్ పరిధిలో బుధవారం చోటు చేసుకున్నది. తూప్రాన్ ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ మున్సిపాలిటీ పరిధి గుండ్రెడ్డిపల్లి గ్రామంలోని చింతల పోచమ్మ(74), బాలనర్సయ్య దంపతులకు కూతురు నాగరాణి, కుమారుడు రాజు ఉన్నారు. ఇద్దరికి వివాహమైంది. 16 నెలల క్రితం తండ్రి బాలనర్సయ్య ఆరోగ్యం బాగాలేక చనిపోయారు. తల్లి ఇంటి వద్దనే ఉంటుంది. మూడు సంవత్సరాల క్రితం కుమారుడు రాజుకి పెళ్లి కావడంతో అప్పటి నుంచి భార్యతో కలసి రాజు మేడ్చల్ జిల్లా సూరారం పట్టణంలో ఉంటున్నారు. గుండ్రెడ్డిపల్లిలోని ఇంటి వద్ద తల్లి పోచమ్మ ఒక్కరే ఉంటున్నారు. గత నెల 21న కుమారుడు రాజు గుండ్రెడ్డిపల్లికి వచ్చాడు. అక్క నాగరాణికి ఫోన్‌చేసి అమ్మకు దమ్ము రావడం లేదని, ములుగు మండలం లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎమ్ ఆసుపత్రికి తరలిస్తున్నామని తెలిపారు. ఆసుపత్రికి తీసుకెళుతుండగా, మార్గమధ్యంలోనే పోచమ్మ మృతిచెందింది. స్థానికులు రాజుపై అనుమానం వ్యక్తం చేయగా అక్క నాగరాణి దృష్టికి వెళ్లింది. ఆమె తమ్ముడు రాజుపై తూప్రాన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో వర్క్‌లోడ్ పెంచాలి

- లేకుంటే కార్మికులకు నష్టమే
- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు వినతి



కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఓడీఎఫ్ ఉద్యోగులు

కంది, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో వర్క్‌లోడ్ పెంచాలని, లేకుంటే కార్మికులు తీవ్రంగా నష్టపోతారని కంది మండల పరిధిలోని ఓడీఎఫ్ (ఆర్డినెన్స్ డిఫెన్స్ ఫ్యాక్టరీ) ఉద్యోగులు బుధవారం కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిసి వినతపత్రం అందజేశారు. ఇందుకు కేంద్ర మంత్రి సానుకులంగా స్పందిచారని, త్వరలోనే ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో వర్క్‌లోడ్ విషయమై రక్షణ మంత్రిత్వ శాఖ దృష్టి తీసకువెళ్తానని తెలిపారని ఓడీఎఫ్ జేఏసీ నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరయ్య, ప్రభు, బాలనర్సయ్య, వెంకటరెడ్డి, పవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీదే అధికారం

- జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి

చేగుంట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలో వస్తుందని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌కు వెళ్తున్న గంగారెడ్డిని బీజేపీ నార్సింగి నాయకులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడానికి నిదర్శనం ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీలు బీజేపీ కైవసం చేసుకోవడమేనన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శర్మ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్మైల్ ప్లీజ్..

నేడు జాతీయ దంత వైద్యుల దినోత్సవం



- దంతాల సంరక్షణతోనే సంపూర్ణ ఆరోగ్యం
- నిర్లక్ష్యం వహిస్తే చిగుళ్లు, దంతాల సమస్యలు
- మూడు నెలలకోసారి పరీక్ష చేయించుకోవాలి
- అందుబాటులో అత్యాధునిక చికిత్స

సిద్దిపేట టౌన్, మార్చి5 (ఆంధ్రజ్యోతి): పేదాలపై పూచే చిరునవ్వు మనిషికే అందాన్ని తీసుకొవస్తుంది. చిరునవ్వు చిందిస్తూ ఎదుటివారిని ఆకర్షించవచ్చు. ఈ చిరునవ్వులో కనిపించే దంతాలతోనే ఆ అందమంతా దాగి ఉంటుంది. దంతాలు ఆరోగ్యంగా ఉంటేనే పదిమందిలోనూ సంతోషంగా నవ్వగలుగుతారు. అలాంటి దంతాల సంరక్షణ ఎంతో ముఖ్యమైనది. శరీరంలో ఇతర ఆరోగ్య సమస్యల మాదిరిగానే దంత సమస్యలు సాధారణ నుంచి తీవ్రమైన నొప్పిని కలిగిస్తాయి. దీంతో పంటినొప్పితో పాటు చిగుళ్ల సమస్యలు, వాపులు రావడం, రక్తస్రావం జరిగి ఆరోగ్యంపై ప్రభావాన్ని చూపిస్తుంది. అందుకే దంతాల పట్ల నిర్లక్ష్యం వహిస్తే భారీ మూల్యం తప్పదని దంత వైద్యులు హెచ్చరిస్తున్నారు. శరీరంలోని భాగాలపై చూపిస్తున్న శ్రద్ధతో పాటు దంతాల సంరక్షణ తప్పనిసరి అని సూచిస్తున్నారు. నేడు జాతీయ దంత వైద్యుల దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

పంటినొప్పి వస్తే భరించడం కష్టతరం

శరీరంలోని పలు భాగాల్లో ఏ నొప్పి వచ్చినా కొంతమేరకు తట్టుకోగలిగినా, పంటి నొప్పి వస్తే మాత్రం తట్టుకోవడం చాలా కష్టతరం. సాధారణంగా తీసుకునే ఆహారం, చిరుతిళ్లు, చల్లని పానీయాలు, ఎక్కువగా తీపి పదార్థాలు క్రమంగా తీసుకోవడం ద్వారా దంతాలపై ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ఇదే క్రమంలో సరైన, నాణ్యమైన, మంచి ఆహారం తీసుకోకపోవడం, ప్రతీరోజు చాకెట్లు తినడం ద్వారా కూడా దంతాలు పుచ్చిపోయి తీవ్రమైన నొప్పికి దారితీస్తాయి. దంతాలు నొప్పి వస్తున్నప్పుడు వెంటనే వైద్యుడిని సంప్రదిస్తే మొదట్లోనే ఆ సమస్యలు పరిష్కారమయ్యే అవకాశాలున్నాయి. నిర్లక్ష్యం వహిస్తే దంతాలు పూర్తి స్థాయిలో పుచ్చిపోయే అవకాశముండటంతో పాటు పన్ను పీకేయాల్సిన పరిస్థితి వస్తుంది.

దంతాలను కాపాడుకోవాలి..



ప్రతీరోజు ఆహారం తీసుకుంటాం కాబట్టి దంతాలను, ఎప్పటికప్పుడు నోరును శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. ఉదయం లేవగానే, రాత్రి పడుకునే ముందు తప్పనిసరిగా బ్రష్ చేయడంతో పాటు వీలైతే మౌత్ వాష్ చేసుకోవాలి. దంతాలకు సంబంధించి సమస్య వస్తే ఇతరుల మాట వినకుండా, సొంత వైద్యం చేసుకోకుండా దంత వైద్యుడిని సంప్రదించాలి. మారుతున్న కాలానుసారంగా ఎన్నో అత్యాధునిక పరికరాలతో దంతాలకు చికిత్స చేసి సంరక్షించుకోవచ్చు. అవసరమైతే తప్ప పన్నును తొలగించకుండా రూట్‌కెనాల్ ట్రీట్‌మెంట్ ద్వారా దంతాలను కాపాడుకోవచ్చు.

-డాక్టర్ అరవింద్‌కుమార్, దంత వైద్య నిపుణులు, సిద్దిపేట

నిర్లక్ష్యం వహిస్తే ..

నాణ్యత లేని ఆహారం తినడం మూలాన ఆ ప్రభావం ఆరోగ్యంపై కనబరుస్తున్నది. తినే ఆహారంలో పంటికి అంటుకుపోయే ఆహారపదార్థాలు ఉంటాయి. ఇలాంటి సమయాల్లో దంతాలను శుభ్రపరుచుకోకుంటే చిగుళ్ల సమస్యలు అధికంగా వస్తాయని దంతవైద్యులు హెచ్చరిస్తున్నారు. దీంతో క్రమేణా దంతాల మధ్యలో సందులు ఏర్పడి, ఆహారం ఇరుక్కపోయి పుచ్చిపోవడంతో పాటు చిగుళ్ల వాపు, రక్తస్రావమయ్యే అవకాశముంది. తద్వారా నోటి నుంచి దుర్వాసన ప్రారంభమవుతుంది. దంత వైద్యుడిని సంప్రదించకుండా నిర్లక్ష్యం చేస్తే సమస్యలు పెరిగి క్రినిక్ జనరైజల్ జింజివైటీస్‌కు దారితీస్తాయని వైద్యులు చెప్పారు. సీజీజీ సోకితే దంతాలకు సంబంధించిన ఎముకలకు బ్యాక్టీరియా చేరి చిగుళ్లు పాడైపోతాయని తెలిపారు.

అత్యాధునిక పరికరాలతో చికిత్స

పంటినొప్పికి సంబంధించి చికిత్సకు అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఎత్తు, వంకర, విరిగినవి, మొదటి దశలో పుచ్చిపోతున్న దంతాలను రూట్ కెనాల్, దంతాల ఎక్స్‌రేతో పాటు పలు ట్రీట్‌మెంట్‌లకు అత్యాధునిక పరికరాల ద్వారా చికిత్స అందించి సంరక్షించుకోవచ్చు. దంతాల్లో ఏర్పడిన రంధ్రాలను శుభ్రపరిచి దానిలో సిమెంట్, సిల్వర్, గ్లాస్ ఐనోమర్ లాంటి వాటితో ఫిల్లింగ్ చేసే సదుపాయాలున్నాయి. కొందరు సమయానికి వైద్యుడి వద్దకు వెళ్లకుండా నొప్పి ఉన్న చోట జాండుబామ్ పెట్టుకుంటే మోహమంతా వాచిపోతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



దంత సంరక్షణ కోసం పాటించాల్సినవి

- ఉదయం, రాత్రి వేళల్లో రెండుసార్లు తప్పనిసరిగా బ్రష్ చేయాలి
- మెత్తని బ్రష్‌ను, వైద్యుడు రాసిచ్చిన టూత్ పేస్ట్‌ను వాడాలి
- పిల్లలకు దంతాలకు అతుక్కపోయే చాక్లెట్లకు దూరంగా ఉండాలి
- ధూమపానం, మద్యపానం, చెడుతినుడులకు దూరంగా ఉండాలి
- నాణ్యమైన ఆహారాన్ని తీసుకోవాలి
- ప్రతీ రోజు మౌత్‌వాష్‌ను వాడటం ద్వారా బ్యాక్టీరియా చనిపోతుంది
- దంతాలను గట్టిగా కొరకడం వంటికి దూరంగా ఉండాలి
- చిగుళ్లు, దంతాల సమస్య ఉంటే వెంటనే దంత వైద్యుడిని సంప్రదించాలి
- ప్రతీ మూడు నెలలకొకసారి దంత వైద్యుడి దగ్గరికి వెళ్లి పరిరక్షించుకోవాలి

ఎస్సారెస్పీలో నీళ్లు తగ్గినా.. రెండు పంటలకు నీళ్లిచ్చాం

- మేడిగడ్డ బ్యారేజ్‌లో ఒక పిల్లర్ మాత్రమే కుంగింది
- బీఆర్ఎస్ మీద బురదజల్లి రాజకీయంగా లబ్ధి పొందారు
- మా మీద కోపంతో రైతులకు అన్యాయం చేయొద్దు
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



నీటి ఎత్తిపోతను పరిశీలిస్తున్న హరీశ్‌రావు

చిన్నకోడూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎస్సారెస్పీలో నీరు తగ్గినా కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేసి ఒక్క ఎకరా ఎండకుండా రెండు పంటలకు నీళ్ల ఇచ్చామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ రిజర్వాయర్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన మంచి పనులను తుడిచిపెట్టాలనో, ఆ పనులను పక్కకు పెట్టాలనే ప్రయత్నంతో ప్రభుత్వం ప్రజలకు నష్టం చేయవద్దన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్‌లు, 19 సబ్‌స్టేషన్లు, 21 పంప్‌హౌస్‌లు, 203 కిలోమీటర్ల టన్నెల్, 1,531 కి.మీ.ల గ్రావిటీ కెనాల్, 98 కి.మీ. ప్రెజర్ మెన్ పైప్‌లైన్, 530 మీటర్ల ఎత్తు లిఫ్ట్, 141 టీఎంసీల రిజర్వాయర్‌ల సామర్థ్యం.. వీటన్నింటి సమాహారమన్నారు. అన్ని బాగున్నాయని ఒక్క మేడిగడ్డ బ్యారేజ్‌లో 1 బ్లాక్‌లో ఒక పిల్లర్ మాత్రమే కుంగిందని తెలిపారు. దీనికి మొత్తం కాళేశ్వరం కొట్టుకుపోయిందని, మునిగిపోయిందని గోరంత దాన్ని కొండంత చేసి దుష్ప్రచారం చేసి, బీఆర్ఎస్ మీద బురదజల్లి రాజకీయంగా లబ్ధి పొందారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు అయిందని, ఆ కుంగిన పిల్లర్‌ను మరమ్మతు చేయడానికి ఈ సమయం సరిపోదా అని ప్రశ్నించారు. పిల్లర్‌ను మరమ్మతు చేస్తే లక్షల ఎకరాల పంటలు కాపాడే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం గుడ్డి వ్యతిరేకతతో మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ మీద కోపంతో రైతులకు అన్యాయం చేయవద్దని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఒక్క ఎకరా కూడా పారలేదని సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని పారే నీళ్లు కాళేశ్వరానికి కాదా..పండే పంట కాళేశ్వరం పంట కాదా అని ఆయన ప్రశ్నించారు. మల్లన్నసాగర్ ,కొండపోచమ్మసాగర్, రంగనాయకసాగర్, అనంతగిరి రిజర్వాయర్ కింద పండే పంటలు కాళేశ్వరం ఫలితం కాదా అన్నారు. రైతులతో పాటు, మత్స్యకారులకు టన్నుల కొద్దీ చేపల ఉత్పత్తి జరుగుతుందని అందరికీ మేలు జరిగే కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు వరప్రదాయిని అన్నారు. హైదరాబాద్‌కు తాగునీరైనా, మూసీలోకి స్వచ్ఛమైన గోదావరి జలాలు ప్రవహించాలన్నా అన్నింటికి కాళేశ్వరమే ముఖ్యమైనదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద సిద్దిపేట నియోజకవర్గంలో 50 వేల ఎకరాల్లో వరి పంట సాగవుతుందన్నారు. పంట పొట్ట దశలోకి వచ్చేసరికి రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లో నీటి లభ్యత తగ్గిందన్నారు. ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోసి పంటలను కాపాడాలని లేఖ ద్వారా ప్రభుత్వాన్ని కోరామని, లేఖపై స్పందించి అనంతగిరి రిజర్వాయర్ నుంచి 1 టీఎంసీ నీటిని రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేస్తున్నందుకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు ,తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్‌లు సదానందం, కనకరాజు, మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, బీఆర్ఎస్ నాయకులు కొండం రవీందర్‌రెడ్డి, ఉమేష్ చంద్ర, శ్రీనివాస్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

రెండు షాపులు సీజ్

- ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేసుకోని యాజమాన్యాలు

జోగిపేట, మార్చి5 (ఆంధ్రజ్యోతి): అందోలు-జోగిపేట మున్సిపల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టణంలోని రెండు షాపులను సీజ్ చేశారు. మున్సిపల్ పరిధిలో వ్యాపారాలు నిర్వహిస్తున్న ఓ మోటార్స్, మరో ఆటోమోబైల్స్ షోరూం యాజమాన్యాలు ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యూవల్ చేసుకోలేదు. సంవత్సరం కాలంగా పలుమార్లు నోటీసులు పంపామని పట్టించుకోలేదని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినయ్ తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు రెండు షాపులను సీజ్ చేశామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, వృత్తి వ్యాపార లైసెన్స్‌లను తీసుకోవాలని, లేని పక్షంలో కలెక్టర్ ఆదేశాల మేరకు సీజ్ చేస్తామని వినయ్ హెచ్చరించారు. మున్సిపల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది శ్రీధర్, ఖయాముద్దీన్, జవాన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి

- న్యాయాధికారి రమేష్

సంగారెడ్డి రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని న్యాయాధికారి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్ అన్నారు. సంగారెడ్డిలోని బాలసదనం, శిశుగృహ, సఖీ కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలు అందరూ క్రమశిక్షణతో నడుచుకోవాలని సూచించారు. పిల్లలకు చట్టాలపై అవగాహన కల్పించాలని, ఏవైనా న్యాయపరమైన సహాయం కోసం సంస్థ కార్యాలయలో సంప్రదిస్తే ఉచితంగా న్యాయసహాయం అందిస్తామన్నారు.

గీతంలో 'గస్టో' పోటీలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న షబ్బీర్‌అలీ

పటాన్‌చెరు రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : రుద్రారంలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ క్యాంపస్‌లో 'గస్టో-2025' పేరిట నిర్వహిస్తున్న మూడురోజుల అంతర్ విశ్వవిద్యాలయ వార్షిక క్రీడా పోటీలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ధ్యాన్‌చంద్ అవార్డు గ్రహీత, భారత ఫుట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్ షబ్బీర్‌అలీ జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలను ప్రారంభించారు.

గజేంద్ర ఆశ్రమంలో హరినామ సప్తాహ

కల్హేర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఏడు రోజుల పాటు నిర్వహించే అఖండ హరినామ సప్తాహ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. సిర్గాపూర్ మండల పరిధిలోని అంతర్గాం గజేంద్ర ఆశ్రమంలో పీఠాధిపతి కరణ్ గజేంద్ర భారతీమహరాజ్ ఆధ్వర్యంలో రుక్మిణీ విఠలేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, సంత్ తుకోభరాయ్ చిత్రపటానికి పూలమాలవేశారు. ఈ కార్యక్రమంలో అంతర్గామ మాజీ సర్పంచ్‌లు రవిపటేల్, విఠల్‌రావ్, కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

వచ్చే విద్యాసంవత్సరం నుంచి అన్ని పాఠశాలల్లో ఏఐ బోధన

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



విద్యార్థితో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మాసాయిపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : వచ్చే విద్యా సంవత్సరం నుంచి మెదక్ జిల్లాలోని అన్ని పాఠశాలలలో ఏఐ విద్యను ప్రారంభించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. మాసాయిపేట మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని ఏఐ సెంటర్‌ను సందర్శించగా, అదే సమయంలో కరెంట్ సరఫరా కట్ కావడంతో 15 నిమిషాలు నిరీక్షించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న పశువుల ఆసుపత్రిని సందర్శించారు. అనంతరం పాఠశాలకు చేరుకుని ఏఐ సెంటర్‌ను, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యుత్ ఏఈ మనోహర్‌ను కరెంట్ కోతలపై అడిగి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత విద్యాసంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా ఆరు ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి వరకు విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజన్స్(ఏఐ)పై శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన ఆరు పాఠశాలలలో ఆయా ఉపాధ్యాయులకు సైతం ప్రత్యేక శిక్షణను అందించినట్లు తెలిపారు. ఏఐ శిక్షణతో విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీసి భవిష్యత్‌లో మంచి ఫలితాలను పొందవచ్చని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. వచ్చే తరంలో ఏఐ అన్ని రంగాల్లో కీలకంగా మారనుందని, విద్యార్థులు చిన్ననాటి నుంచే ఏఐలో నిష్ణాతులు కావాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీడీవో విఘ్నేశ్వర్, తహసీల్దార్ జ్ఞాజ్యోతి, ఆర్ఐ ధన్‌సింగ్, ప్రధానోపాధ్యాయులు బాలమణి, ధర్మపురి తదితరులు ఉన్నారు.

ఏఐ టెక్నాలజీతో ఉపయోగం

నిజాంపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఏఐ టెక్నాలజీతో విద్యార్థులకు ఎంతో ఉపయోగమని డీఈవో రాధాకిషన్ అన్నారు. నిజాంపేటలోని ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన సందర్శించి కంప్యూటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ విద్యార్థుల మేధస్సుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం పాఠశాల హాజరు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో సాంగని యాదగిరి ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించండి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం 1,36,821 మందిని అర్హులుగా గుర్తించామని, మంజూరైన ఇళ్లను వెంటనే మార్కింగ్ చేసి ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని గ్రామపంచాయతీల్లో ఎల్ఆర్ఎస్ డబ్బు బ్యాలెన్స్ త్వరగా వసూలు చేయాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అన్ని గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో చలివేంద్రాలు, పశువుల నీటి తొట్టెలను ఏర్పాటు చేచసి తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రత్యేకాధికారులు గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో ప్రతీనెల తప్పనిసరిగా తనిఖీలు నిర్వహించాలన్నారు. గురుకులాలు, వసతి గృహాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు సిబ్బందితో సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. గ్రామాల్లో కనీసం 60 మంది కొత్తవారికి ఉపాధి పని కల్పించాలన్నారు.

25 శాతం రాయితీతో లేఅవుట్ల క్రమబద్ధీకరణ

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తులు చేసుకునే వారికి 25 శాతం రాయితీ లభిస్తుందని కలెక్టర్ తెలిపారు. అనుమతి లేని లేఅవుట్ల క్రమబద్ధీకరణలో అనుమానాలు, ఇబ్బందులు ఎదురైతే సంబంధిత మున్సిపల్ కార్యాలయాల్లోని హెల్ప్‌డెస్క్‌లో సంప్రదించాలన్నారు. జిల్లాలోని అర్హులైన వారందరూ గడువులోగా తమ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవాలన్నారు. జిల్లాలోని 12 మున్సిపాలిటీల అధికారులు బిల్ కలెక్టర్లతో ప్రతీరోజు రివ్యూ నిర్వహించి ఇంటి పన్ను, నల్లా బిల్లులు వందశాతం వసూలు చేయాలన్నారు. లక్ష్యాన్ని పూర్తిచేయని మున్సిపల్ సిబ్బందికి మెమోలు జారీ చేయక తప్పదని హెచ్చరించారు. కొత్తగా ఏర్పాటైన నాలుగు మున్సిపాలిటీల్లో జీపీల నుంచి అసెస్మెంట్‌కు సంబంధించిన రికార్డులన్నీ స్వాధీనం చేసుకోవాలన్నారు. హెచ్ఎండీఏ పరిధి చెరువులు, కుంటల ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతంచేయాలని కలెక్టర్ క్రాంతి ఆదేశించారు.సమావేశంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్, జడ్పీ సీఈవో జానకిరెడ్డి, డీపీవో సాయిబాబ, హౌజింగ్ పీడీ చలపతిరావు, అధికారులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఎంపీకి శుభాకాంక్షలు

జహీరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలిగా ఎన్నికైన అస్మాతబస్సుం బుధవారం హైదరాబాద్‌లో జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్‌ను, మాజీమంత్రి చంద్రశేఖర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ తన ఎన్నికకు సహరించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

మానవ పురోగమనానికి సైన్స్ దోహదం

పుల్‌కల్: మానవ పురోగమనానికి సైన్స్ ఎంతగానో దోహదపడుతుందని జేఎన్టీయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ జి.నరసింహ అన్నారు. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో హ్యూమానిటీస్ అండ్ సైన్స్ విభాగం, ఇన్‌స్టిట్యూట్ న్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సైన్స్ డేను నిర్వహించారు. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ జి.నరసింహ ప్రారంభించారు.

తాగునీటి సమస్యపై అప్రమత్తంగా ఉండాలి

- ప్రతి నెలలో మూడుసార్లు ట్యాంకులను శుభ్రం చేయాలి
- ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

నారాయణఖేడ్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి సమస్యపై అధికారులు ప్రధానంగా పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి కోరారు. బుధవారం నారాయణఖేడ్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నారాయణఖేడ్ ప్రాంతంలో ఎండాకాలంలో నీటిఎద్దడి ఉండకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, తాను ఈఎన్‌సీని కోరానన్నారు. ఈ మేరకు అధికారులు నియోజకవర్గంలోని గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారన్నారు. మిషన్ భగీరథ ద్వారా నిరంతరం నీటి సరఫరా ఉండడం కోసం డెడికేటెడ్ విద్యుత్ లైన్ అంతరాయం లేకుండా విద్యుత్‌ను సరఫరా చేయడం కోసం పనులు చేయిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే బోరంచ వద్ద విద్యుత్ మోటార్లకు మరమ్మతులు చేయించామని, గూడూరు వద్ద కొత్త మోటార్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శాపూర్ సెగ్మెంట్ మరమ్మతుకు రూ.4 కోట్లతో ప్రతిపాదనలు చేయించామని, వేసవిలో నీటి సమస్యను పరిష్కరించడానికి తమ ఎస్‌డీఎఫ్ నిధులతో పాటు కలెక్టర్ ఎస్‌డీఎఫ్ నిధులను కూడా వినియోగించనున్నామన్నారు. రూ.2.50 కోట్లతో నీటి సమస్యను అధిగమించడానికి యాక్షన్‌ప్లాన్ చేయించామన్నారు. సింగూరు నీటిని వ్యవసాయానికంటే తాగునీటి అవసరాలకు ఇవ్వడానికే ప్రాధాన్యతను ఇస్తున్నామన్నారు. గ్రామాల్లోని ట్యాంకులను ప్రతినెల 1, 11, 21 తేదీల్లో శుభ్రం చేయడమే కాకుండా నీటిని నాణ్యతగా సరఫరా చేయడం కోసం క్లోరినేషన్ చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, పీఏసీఎస్ చైర్మన్ శోభాఅశోక్‌రెడ్డి, న్యాయవాది సంగన్న, కాంగ్రెస్ నాయకులు రాజేందర్‌పాటిల్, దుద్దగొండ మాజీ సర్పంచ్ రాజు, విఠల్‌రావు, పరశురాం పాల్గొన్నారు.

బట్టీలకూ 'భరోసా'..!

5వ పేజీ తరువాయి

దక్కుతున్నది. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు ఇటీవల క్షేత్రస్థాయిలో సర్వే చేశామని చెబుతున్నప్పటికీ అందులో ఇటుక బట్టీలు ఉన్న భూములను తొలగించనట్లుగా అర్థమవుతోంది.

కన్నెత్తి చూడని అధికారులు

అడ్డగోలుగా ఇటుకబట్టీలను నిర్వహిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. రైతుల భూముల్లో నల్లమట్టి ని తరలించే పేరిట చెరువు మట్టిని బట్టీలకు తరలిస్తున్నారు. బొగ్గు, వరిపొట్టుతో బట్టీలను మండించకుండా పచ్చని చెట్లను నరికి కలప దుంగలతో నిప్పు రాజేస్తున్నారు. చేసేది వ్యాపారమైతే వ్యవసాయానికి అందాల్సిన ఉచిత విద్యుత్‌ను ఎడాపెడా వినియోగిస్తున్నారు. వీటన్నింటికీ తోడుగా రైతు భరోసా సహాయాన్ని దర్జాగా పొందుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారుల్లో మాత్రం చలనం కలగడం లేదు.

లావణి భూ సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే సునీతారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న చండూరు, గుజిరితండా గ్రామస్థులు

చిలప్‌చెడ్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : చండూరు రెవెన్యూ గ్రామానికి చెందిన లావణి భూమిలో నెలకొన్న సమస్యను పరిష్కరించాలని గుజిరితండా గ్రామస్థులు బుధవారం ఎమ్మెల్యే సునీతారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గల 67వ సర్వే నంబరులో 301 ఎకరాల పొలం ఉన్నదని, కానీ ఖాస్తులో 350 ఎకరాలుగా చూపిస్తున్నదన్నారు. 49 ఎకరాలు ఎక్కువగా ఉన్న భూమికి పట్టాపాసు పుస్తకాలు జారీ చేయలేదన్నారు. తమకు తగిన న్యాయం చేయాలని కోరారు. అలాగే మంజీరా నదిలోంచి రామలింగేశ్వర ఎత్తిపోతల పథకం కింద చండూరుకు సాగునీరు వచ్చేదని, ప్రస్తుతం పంపుసెట్లు పాడైపోవడం వల్ల లిఫ్ట్ పని చేయక నీరు రావడం లేదని, నిధులు విడుదల చేసి మరమ్మతు చేయించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో చండూరు, గుజిరితండా రైతులు పాల్గొన్నారు.

కులగణనతో సామాజిక న్యాయం: నీలం మధు



కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణన చరిత్రాత్మకమని, ఈ బీసీ కులగణనతోనే ముదిరాజ్‌లకు రాజకీయంగా అవకాశాలు పెరుగుతాయని కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్ అన్నారు. బుధవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం తొండుపల్లి, శంషాబాద్ పరిధిలోని ఎంఎస్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి ముదిరాజ్ కృతజ్ఞత సభలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నీలం మధు మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాలకు రాజకీయ అవకాశాలను కల్పించాలని ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టి చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాసాని వీరేష్, అందే బాబన్న, గుండ్లపల్లి శ్రీనివాస్, మిద్దెల సంతోష్, ముదిరాజ్ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

'పది' ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి: డీఈవో

సంగారెడ్డి అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈవో వెంకటేశ్వర్లు సూచించారు. సంగారెడ్డిలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులు, బోధన తీరును పరిశీలించారు. అంతేకాకుండా నీట్ పరీక్ష కోసం పాఠశాల సెంటర్ ఎంపిక సాధ్యాసాధ్యాలను పరిశీలించి వసతులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రోజా, ఏసీ పండరీ నాయక్ తదితరులు ఉన్నారు.

'ట్రైడెంట్'ను పునరుద్ధరించాలి

జహీరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి)గ్రామంలో మూతపడిన ట్రైడెంట్ చక్కెర కర్మాగారంలో మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించాలని కర్మాగారం ఎదుట కార్మికులు, రైతులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్మాగారం మూతపడడంతో రైతులతో, కార్మికులు వేతనాలు రాక ఆందోళన చెందుతున్నారన్నారు. కర్మాగారంలో యంత్రాలను, ఇతరత్రా తుక్కును తొలగిస్తూ తరలించడాన్ని తప్పుపట్టారు. ఇందులో భాగంగా జహీరాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకుడు హుగ్గెల్లి రాములు, కార్మికులు, రైతులు పాల్గొన్నారు.

సాగుకు యోగ్యం లేని భూముల వివరాలు సేకరించాలి: ఆర్డీవో

జహీరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : సాగుకు యోగ్యంగా లేని భూముల వివరాలను సేకరించాలని జహీరాబాద్ ఆర్డీవో రాంరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మొగుడంపల్లి మండలంలోని ధనసిరి, ఇప్పపల్లి తదితర గ్రామాల్లో రెవెన్యూ అధికారులతో కలిసి పర్యటించి వివిధరకాల భూములను పరిశీలించి, మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాలవారీగా సాగుకు యోగ్యం లేని వ్యవసాయ భూములను పరిశీలిస్తున్నామని చెప్పారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ అధికారులతో సమావేశమయ్యారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపన

నారాయణఖేడ్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పట్టణ శివారులో భక్త మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు రెండోరోజైన బుధవారం కొనసాగాయి. ఉదయం యాగ సంకల్పం, వేదమంత్ర పారాయణాలు, గణపతిపూజ, ధాన్యాదివాసం, రరుద్ర పురుష సూక్త శ్రీ, సూక్త భూసూక్త సూర్యగణపతి, హోమాలు గురుజ్యోషి ఆధ్వర్యంలో నిర్వహించారు.

వైభవంగా రాచన్నస్వామి జాతర

కోహీర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మండలం బడంపేట గ్రామంలో రాచన్నస్వామి జాతర కొనసాగుతోంది. రెండోరోజైన బుధవారం తెల్లవారుజామున స్వామివారికి పల్లకీసేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన మంగళహారతి నిర్వహించారు. కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఉపాధ్యాయులకు వేతనం ఇవ్వాలి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శివ్వంపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు వేతనం ఇవ్వాలని ఎంఈవో బుచ్చానాయక్ ఆదేశించారు. 'ప్రైవేట్ ఉపాధ్యాయులకు జీతం ఇవ్వని యాజమాన్యం' అనే వార్త 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. డీఈవో రాధాకిషన్ ఆదేశాల మేరకు ఎంఈవో మండల పరిధిలోని గోమారం ఉన్నత గ్లోబల్ స్కూల్‌ను సందర్శించారు. వేతనాల విషయమై ప్రిన్సిపల్ శైలజను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 25లోపు వేతనాలు చెల్లిస్తానని యజమాన్యం చెప్పడంతో విధులకు హాజరయ్యారు.

పెయింటింగ్ పోటీల్లో ఓడీఎఫ్ విద్యార్థుల ప్రతిభ



సృజన వేసిన పెయింటింగ్

కంది, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా జాతీయ భద్రతా మండలి తెలంగాణ విభాగం, రాష్ట్ర కార్మిక మంత్రిత్వశాఖ సంయుక్తంగా 'జాతీయ భద్రత, ఆరోగ్యం, పర్యావరణం' అనే అంశంపై బుధవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించింది. కంది మండలం ఆయుధ కర్మాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని ఎస్.సృజన, ఎనిమిదో తరగతి విద్యార్థి డి.మనోహర్ సీనియర్ విభాగంలో ప్రథమ, తృతీయ బహుమతులు పొందినట్లు గైడు ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు తెలిపారు. వీరికి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

నీటి సమస్యపై పర్యటన

నారాయణఖేడ్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మిషన్ భగీరథ నీటి సరఫరా తీరును తెలుసుకోవడానికి, నీటి సమస్య గురించి పరిశీలించడానికి మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అధికారుల బృందం నారాయణఖేడ్ ప్రాంతంలో బుధవారం ఆకస్మికంగా పర్యటించి వివరాలు సేకరించారు. మండల కేంద్రమైన నిజాంపేటలోని పలు కాలనీల్లో సైతం పర్యటించి ప్రజల నుంచి నీటి సరఫరా వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఇళ్ల మధ్య విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దు: కాలనీవాసులు

మెదక్ అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల మధ్య విద్యుత్ సబ్ స్టేషన్ వద్దని సుభాష్ కాలనీ వాసులు నిర్మాణ పనులను అడ్డుకున్నారు. సబ్ స్టేషన్‌ను అక్కడి నుంచి తొలగించాలని బుధవారం అదనపు కలెక్టర్ నగేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పోచయ్య, మహిపాల్, ముస్తఫా, ఫెరోస్, గణేష్, గోపాల్ మాట్లాడుతూ.. 35 ఏళ్లుగా కాలనీలో వంద కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, ఇది పూర్తిగా నివాస గృహాలతో కూడుకున్న ప్రాంతమన్నారు. అలాంటి చోట 33/11 కెపాసిటీ సబ్ స్టేషన్ నిర్మించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. నిర్మాణ విషయంతో కలెక్టర్‌తోపాటు విద్యుత్ అధికారులు పునరాలోచించి, పనులు నిలిపివేయాలని కోరారు.

కేసీఆర్ పాలనలో తెలంగాణ ధ్వంసం

రామాయంపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఉద్యమకారులతోనే కొత్త రాష్ట్రం సుసాధ్యమైందని.. కేసీఆర్ పాలనలో తెలంగాణ ధ్వంసమైందని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు(టీయూజేఏసీ) సుల్తాన్ యాదగిరి ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం రామయంపేటలో మిలియన్ మార్చ్‌కు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం మెదక్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కళాకారుల బృందం నాటి ఉద్యమ పాటలు పాడి ఉత్తేజపరిచారు. ఇందులో తుమ్మల రాంరెడ్డి, ఎర్రం దుర్గం, రమేష్ గౌడ్ ఉన్నారు.

కార్మికులంటే ప్రభుత్వాలకు అంత నిర్లక్ష్యమా


- సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు



కంది మండలం జుల్‌కల్‌లోని ఓ పరిశ్రమ కార్మికులతో మాట్లాడుతున్న సాయిలు

కంది/పుల్‌కల్/నర్సాపూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం 73వ షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలు డ్రాఫ్ట్ జీవోలను సవరించి, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. బుధవారం కంది మండల పరిధిలోని జుల్‌కల్‌లోని పరిశ్రమల్లో కార్మికులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కోటి 20 లక్షల మంది జిల్లాలో 5 లక్షల మంది కార్మికులు కష్టపడి పనిచేస్తున్నా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం అమలు కావడం లేదని అన్నారు. ఈనెల 7న జరిగే కలెక్టర్ ఆఫీస్ ముందు జరగబోయే ధర్నా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాగభూషణం, సత్యనారాయణ, రాజు, నరేష్, కార్మికులు పాల్గొన్నారు. అలాగే చౌటకూర్ మండలం శివంపేట బీరు పరిశ్రమలో క్యాంపెయిన్‌లో భాగంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయులు కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ మెదక్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం నర్సాపూర్ అసిస్టెంట్ లేబర్ అధికార కార్యాలయంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజుతో కలిసి విలేకరులతో మాట్లాడారు.

నాలా ఆక్రమణలపై జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదు



ప్రణీత్ ప్రనవ్ నైట్‌హుడ్ విల్లా కాలనీ

పటాన్‌చెరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు పట్టణంలోని ప్రణీత్ ప్రనవ్ నైట్‌హుడ్ విల్లా ప్రాజెక్టు సంస్థ నాలా కబ్జాకు పాల్పడ్డారన్న ఆరోపణలపై జీహెచ్‌ఎంసీ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. పటాన్‌చెరు పట్టణ శివారులో భారీ విల్లా ప్రాజెక్టు పూర్తి చేసిన వెంకటప్రణీత్ డెవలపర్స్ పలు సర్వేనెంబర్లలో నాలా కబ్జాకు పాల్పడినట్టు గ్రామ రైతులు, కాలనీకి భూములను డెవలప్‌మెంట్‌కు ఇచ్చిన భూయజమానులు జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదు చేశారు. విల్లా ప్రాజెక్టును ఆనుకుని ప్రవహిస్తున్న భారీ వాగులోకి 9 మీటర్ల బఫర్‌జోన్‌తో పాటు 3 మీటర్ల నాలాను కబ్జా చేసినట్లు జీహెచ్‌ఎంసీ నార్త్ ట్యాంక్స్ డివిజన్ ఇరిగేషన్ డీఈ, ఏఈల క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడైంది. నిబంధనల ప్రకారం నాలా మధ్య నుంచి 24 మీటర్లు ఉండాల్సిన బఫర్ జోన్‌ను 12 మీటర్ల మేర కబ్జా చేసి ప్రహరీని నిర్మించినట్లు దర్యాప్తులో తేలింది. సర్వేనెంబర్లు 351, 347, 466పార్ట్, 346, 350, 352, 467, 348, 349, 344పార్ట్, 468 సర్వేనెంబర్లలో నాలా బఫర్ జోన్ ఆక్రమణ జరిగినట్లు జీహెచ్‌ఎంసీ నిర్మాణ సంస్థకు జారీచేసిన నోటీసులో పేర్కొన్నారు. కాగా గతంలో జారీచేసిన నోటీసులకు సదరు నిర్మాణ సంస్థ స్పందించకపోవడంతో తదుపరి చర్యలకు అధికారులు ఉపక్రమిస్తున్నారు. ఇదిలా ఉండగా గేటెడ్ కమ్యూనిటీలోని విల్లాల నిర్మాణం వందశాతం పూర్తి జరిగింది. పెద్దఎత్తున జనాలు విల్లాలను కోట్లాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేశారు. ఈ క్రమంలో నాలా కబ్జా వ్యవహారం బహర్గతం కావడంతో వినియోగదారుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఎప్పుడే చర్యలు తీసుకుంటారా అన్న ఉత్కంఠత నెలకొంది. నిబంధనలను ధిక్కరించిన నిర్మాణ సంస్థ వల్ల తమ విల్లాలకు ఎలాంటి ముప్పు వాటిల్లుతుందో అన్న చర్చ కొనసాగుతోంది. ఆక్రమణ కేవలం ప్రహరీకే పరిమితమైందా.. నిర్మాణం పూర్తి చేసుకున్న విల్లాలు నాలా పరిధిలోకి వస్తాయా అన్న ఆందోళనకు గురవుతున్నారు. జీహెచ్‌ఎంసీ ఇరిగేషన్ ఇంజనీర్లు విల్లా యజమానులకు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

పరిశ్రమల్లో యువతకు ప్రాధాన్యం ఇవ్వాలి



రుద్రారంలో స్టీల్ పరిశ్రమను ప్రారంభిస్తున్న హన్మంతరావు

చిన్నశంకరంపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల్లో ఉపాధి కల్పనకు యువతకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మైనంపల్లి హన్మంతరావు అన్నారు. చిన్నశంకరంపేట మండలం రుద్రారం గ్రామ శివారులో ఏర్పాటు చేసిన శ్రీరాజు ఐరన్ స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను బుధవారం ఆయన, పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ కిషన్ అగర్వాల్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. పరిసర ప్రాంతాల యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలని పరిశ్రమ యాజమాన్యానికి సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాన సత్యనారాయణ, మాజీ సర్పంచులు రాజిరెడ్డి, లక్ష్మణ్, శ్రీమాన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగా నరేందర్, సొసైటీ మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ న్యూరో సదస్సుకు డా.కృష్ణమూర్తి



డా.కృష్ణమూర్తి

సంగారెడ్డి అర్బన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ న్యూరో సదస్సుకు సంగారెడ్డి చౌరస్తా సమీపంలోని హోప్ న్యూరో అండ్ కార్డియాక్ హాస్పిటల్ చైర్మన్ డా.కృష్ణమూర్తి ఎంపికయ్యారు. గోవాలో ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు జరగనున్న సదస్సులో పాల్గొనేందుకుగాను ఆయన ఆహ్వానం అందుకున్నారు. 'న్యూరో సర్జరీలో అనుకోకుండా వచ్చే సవాళ్లు- వాటి పరిష్కార మార్గాలు' అనే అంశంపై ఆయన ప్రసంగించనున్నారు. సంగారెడ్డి జిల్లా నుంచి డా.కృష్ణమూర్తి పలు సందర్భాల్లో అంతర్జాతీయ వేదికలపై ప్రసంగించడం అభినందనీయమని మిత్రులు, శ్రేయోభిలాషులు ఆనందం వ్యక్తం చేశారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



పుల్‌కల్: స్వయంపాలనలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

పుల్‌కల్/చిన్నశంకరంపేట/నర్సాపూర్/చేగుంట, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం చౌటకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి పర్యవేక్షణలో విద్యార్థులు గురువులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది సి.మోహన్‌రెడ్డి, రమాదేవి, భాస్కర్, మల్లేశం, రవీందర్, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు. చిన్నశంకరంపేట మండలం చందంపేట ప్రాథమిక పాఠశాల, నర్సాపూర్ మండలం నారాయణపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, చేగుంట మండలం కర్నాల్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు.

రూ.3 కోట్ల సొంత నిధులతో ఆలయాల నిర్మాణం

రామచంద్రాపురం టౌన్ మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం డివిజన్ పరిధి శ్రీనివాస్‌నగర్ కాలనీ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మితమయిన రామాలయం, శివాలయం, సరస్వతీదేవి, జంటనాగులు, ధ్వజ స్తంభం రోహణలతో పాటు విగ్రహాల ప్రతిష్ఠాపనలకు మూడురోజుల ఉత్సవాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. బుధవారం ధ్వజస్తంభంతో పాటు ప్రత్యేకంగా పూజలతో పాటు హోమం నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పానగేష్ మాట్లాడుతూ ఐదురకాల విగ్రహాలకు పూజలు నిర్వహించిన తరువాత ఈనెల 9న ప్రతిష్ఠాపన చేయనున్నామని వివరించారు. ఇందుకు రూ.3 కోట్ల వరకు సొంత నిధులు వెచ్చించామని తెలిపారు.

పింఛన్ కోసం వృద్ధురాలి పాట్లు



రేగోడు బ్యాంక్‌కు వెళ్తున్న వృద్ధురాలు

రేగోడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పింఛన్ డబ్బుల కోసం ఓ వృద్ధురాలు పాకుకుంటూ బ్యాంకు వద్దకు వెళ్లడం పలువురిని కలిచివేసింది. రేగోడు గ్రామానికి చెందిన వృద్ధురాలు జయమ్మ పింఛన్ డబ్బుల కోసం బుధవారం వెళ్లింది. నడవలేని స్థితిలో పాకుకుంటూ రోడ్డుపై వెళ్లడాన్ని చూసినవారు చలించిపోయారు. బ్యాంకు మిత్రలు ఇంటికి వెళ్లి పింఛన్ డబ్బులు ఇవ్వాల్సి ఉండగా.. సమయానికి రాకపోవడంతోనే బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.



మొక్కను తీసుకొస్తున్న మాజీ కౌన్సిలర్ సమియొద్దీన్, తిరిగి కాలనీలో మొక్కలను నాటి నీళ్లు పోస్తున్న దృశ్యం

వాళ్లు తీసేశారు.. వీరు జీవం పోశారు

మెదక్ పట్టణ రహదారి విస్తరణలో భాగంగా డివైడర్ మధ్యలో చెట్లు నాటారు. ప్రస్తుతం జాతీయ రహదారి విస్తరణలో కొన్ని చెట్లు తొలగించాల్సి వచ్చింది. ఈ క్రమంలో ఇది గమనించిన ప్రకృతి ప్రేమికుడైన 11వ వార్డు మాజీ కౌన్సిలర్ సమియొద్దీన్ తీసేసిన మొక్కలను తీసుకెళ్లి తన వార్డులోని వెంకట్రావ్‌నగర్, సాయి, హన్మంతరావునగర్ కాలనీల్లోని పార్కుల వద్ద నాటి జీవం పోశారు.

\- మెదక్ మున్సిపాలిటీ